క్లుప్తంగా

పలాస ఏఎంసీ చైర్మన్‌గా శ్రీనివాసరావు


మల్లా శ్రీనివాసరావు

కాశీబుగ్గ: పలాస వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన మల్లా శ్రీనివాసరావు నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో భాగంగా మల్లాకు ఈ అవకాశం దక్కింది. ప్రస్తుతం పలాస క్యాష్యూ మాన్యుఫాక్చర్ అసోసియేషన్ (పీసీఎంఏ) అధ్యక్షులుగా శ్రీనివాసరావు పనిచేస్తున్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా ఏఎంసీ చైర్మన్‌గా ఈయన పనిచేసి ఉన్నారు. పలువురు అభినందనలు తెలియజేశారు.

రూ. 49 వేల ఆర్థిక సాయం


బాధిత కుటుంబ సభ్యులకు సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

మందస: మండలంలోని దున్నవూరు పంచాయతీకి చెందిన తెప్పల ధనలక్ష్మి తీవ్ర అనారోగ్యంతో మంచం పట్టింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులతోపాటు మొగిలిపాడు గ్రామానికి చెందిన వారు 49,200 సేకరించారు. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. వైద్యం కోసం ఈ మొత్తాన్ని ఉపయోగించాలని సూచించారు. గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

కాశీబుగ్గ: పలాస మండల లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో పలాస ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి అధ్యక్షతన విద్యార్థులకు పోక్సో చట్టంపై (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ అఫెన్సెస్) శుక్రవారం అవగాహన కల్పించారు. సీనియర్ న్యాయవాది బి.కామేశ్వర పట్నాయక్, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జి.ఎం.ఎ స్.అనిల్‌రాజ్ మాట్లాడుతూ పోక్సో లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించే భారతీయ చట్టమన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మెంబర్ కోత రజనీకుమార్, లోక్ అదాలత్ సభ్యుడు గురుబెల్లి ప్రభాకర్, న్యాయవాదులు లోకేష్, దేవరాజు, శ్యామ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చిట్టిబాబుకు రేడియోలో పాడే అవకాశం


రేడియో కేంద్రంలో పాట పాడుతున్న చిట్టిబాబు

పలాస: రిట్టపాడు గ్రామానికి చెందిన గాయకుడు బాలక చిట్టిబాబుకు రేడియోలో పాడే అవకాశం లభించింది. రేడియో కిసాన్ దివస్ సందర్భంగా వరంగల్ రేడియో స్టేషన్‌లో చిట్టిబాబు తన మధుర గానాన్ని వినిపించారు. ప్రముఖ కవి బమ్మిడి సుబ్బారావు పర్యావరణ పరిరక్షణ, చెట్లు ఆవశ్యకత అనే అంశంపై పాట రాయగా.. చిట్టిబాబు దాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా రేడియో కేంద్రం అధికారులు ఆయన్ని సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ.. రేడియోల ద్వారా వ్యవసాయదారులకు సకాలంలో సలహాలు, సూచనలు ఇస్తూ ఎంతో ఉపయోగపడేవని గుర్తు చేశారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

టెక్కలి రూరల్: స్థానిక దండుపాటి వీధికి చెందిన వివాహిత రాజేశ్వరి ఈ నెల 22వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి కొట్నాన సీతమ్మ శుక్రవారం టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలాకి మండలం డోల గ్రామానికి చెందిన రాజేశ్వరి.. టెక్కలి దండుపాటి వీధిలో తన భర్తతో కలిసి ఉంటుండేవారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

వజ్రపుకొత్తూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ల రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో బ్యాంకర్లు అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించారు. మండలానికి 110 యూనిట్లు మంజూరు కాగా మండల వ్యాప్తంగా 472 మంది దరఖాస్తు చేసుకున్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై ఎమ్మెల్యే గౌతు శిరీష జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు విచారణ చేపట్టారు. శుక్రవారం ఉదయం గ్రామ సచివాలయానికి డివిజన్ పంచాయతీ అధికారి ఆర్.గోపిబాల, ఈఓపీఆర్డీ తిరుమలరావు రికార్డులు పరిశీలించారు. 2021 నుంచి ఇప్పటి వరకు అయిన నిధుల ఖర్చుపై పంచాయతీ కార్యదర్శుల నుంచి వివరాలను సేకరించారు. 20 రోజుల్లో నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి అందిస్తామని చెప్పారు. సర్పంచ్ లండ లోలాక్షి, మాజీ సర్పంచ్ లండ రామలింగం, ఉప సర్పంచ్ కె.సోమ్మేశ్వరరావు ఉన్నారు.


చేపల మార్కెట్ వద్ద రోడ్డు దుస్థితి

- ఛిద్రమైన మండల కేంద్రం రహదారి
- పట్టించుకోని పాలకులు
- అవస్థలు పడుతున్న జనం


కంచిలి ఎస్‌బీఐ కూడలి వద్ద పాడైన రోడ్డు

కంచిలి రోడ్డుపై.. నడక యాతన!

కంచిలి: మండల కేంద్రమైన కంచిలి ప్రధాన రహదారి ఛిద్రమైంది. పేరుకే మండల ప్రధాన కేంద్రమైనప్పటికీ ఈ రోడ్డును పాలకులు, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అడుగడుగునా గోతులమయమై దారుణంగా తయారైంది. దీంతో 'నడిచి వెళ్లేందుకు కూడా జనం నరక యాత్రన'పడుతున్నారు. రోజూ అధికారులు, ప్రజాప్రతినిధులు మండల కేంద్రానికి వచ్చి వెళ్తున్నా ఈ రోడ్డుపై దృష్టి కేంద్రీకరించలేదు. మండల కేంద్రంలో కంచిలి పంచాయతీతోపాటు ఎస్.ఆర్.సి.పురం, అంపురం, పురుషోత్తపురం పంచాయతీల గ్రామాలు కలిసి ఉన్నాయి. అంతేకాకుండా మండలవ్యాప్తంగా ఉన్న ప్రజలతోపాటు ఉద్దానం గ్రామాల ప్రజల అవసరాలు తీర్చు వ్యాపార కూడలి కూడా ఇదే. ఇంతటి ప్రాధాన్యత గల రహదారి పూర్తిగా శిథిలమైంది. గోతులు పూడ్చే కార్యక్రమం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రధాన రోడ్డు మరమ్మతుల విషయాన్ని పూర్తిగా పక్కన పెట్టేశారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తుంటే .. ఈ రహదారికి అధికమొత్తంలో గ్రాంటు తెస్తామని కల్లబొల్లి కబుర్లు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో గోతుల రోడ్డుపైనే మండల ప్రజలు అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ ఉన్న రైల్వేస్టేషన్‌కు కూడా రోజూ వందలాది వాహనాలు వస్తుంటాయి. వీళ్లంతా రహదారి ఇబ్బందులు పడుతున్నారు. చాలా కాలంగా ఈ రహదారిని మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూడుసార్లు టీడీపీ తరఫున ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన బెందాళం అశోక్ కనీసం ఈ రోడ్డు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. మరో రెండు నెలల్లో కంచిలిలో భారీ స్థాయిలో గ్రామదేవత ఉత్సవాలు జరగనున్నాయి. ఇలోగా కనీసం రోడ్డుకు మరమ్మతులైనా చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.


బైపాస్ రోడ్డు కూడలికి వెళ్లే మార్గంలో పరిస్థితి ఇలా..

ప్రజలు అవస్థలు పడుతున్నారు..



కంచిలి మెయిన్‌రోడ్డు పూర్తిగా శిథిలం కావడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంతోపాటు వ్యాపార కూడలిగా, విద్యాసంస్థలు ఉండటంతో రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రోడ్డు దుస్థితితో వారంతా అవస్థలు పడుతున్నారు. దీన్ని వెంటనే మరమ్మతులు చేయాలి. రానున్న గ్రామదేవత ఉత్సవాల సమయానికి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలి.

– సునీల్ రాథోడ్, ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, కంచిలి

ధూళితో ఇబ్బందులు



కంచిలి మెయిన్ రోడ్డు గోతుల మయమైంది. మరోవైపు కేబుల్ వేయడానికి ఇటీవల రోడ్డు పక్కన తీసిన గోతులు సరిగ్గా పూడ్చకపోవడంతో రోడ్డుపైన ఇసుక మేటలు వేసింది. దీంతో వాహనాలు వెళ్లే సమయంలో విపరీతమైన ధూళి ఎగురుతోంది. దీని వలన తినుబండారాలు విక్రయించే వ్యాపారులు వాటిని జాగ్రత్త చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. ధూళితో ప్రజారోగ్యం దెబ్బతినే అవకాశం ఉంది. తక్షణమే మరమ్మతులు చేపట్టాలి.

– గుడియా శంకర్, జ్యూస్ షాప్, కంచిలి

సంప్రదాయబద్ధంగా విశ్వశాంతి యజ్ఞం


కంచిలి: యజ్ఞాన్ని దర్శించుకొని పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ విజయ

కంచిలి: తలతంపర గ్రామంలోని అలేఖ్ మందిరం వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం విశ్వశాంతి యజ్ఞాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ హాజరై హోమాన్ని దర్శించుకున్నారు. యజ్ఞం విశిష్టతను నిర్వాహకులు ఆమెకు తెలియజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఒడిశాలో ఆలయ ప్రతిష్టకు జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఆహ్వానం

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామం పాత్రపురం బ్లాక్ జయంతిపురంలో పశ్చిమేశ్వరి అమ్మవారి రత్నముద్ర మందిర ప్రతిష్ట, మహాయజ్ఞ కార్యక్రమం వచ్చే నెల ఐదు నుంచి తొమ్మిదో తేదీ వరకు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరుతూ కమిటీ సభ్యులు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయను తన నివాసంలో శుక్రవారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. జయంతిపురం సర్పంచ్ ఇసురు బాలకృష్ణ, మాజీ సర్పంచ్ అగ్గారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాకి లక్ష్మీనారాయణ, బింగి నీద్రిరెడ్డి ఉన్నారు.

ఉపాధ్యాయులపై క్రిమినల్ కేసులు ఎత్తివేయాలి


ప్రభుత్వ విప్ అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

కవిటి: ఎచ్చెర్ల మండలం కుప్పిలి పాఠశాల కేంద్రంగా జరిగిన పదో తరగతి పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ జరిగిందే ఉద్దేశంతో కొంతమంది ఉపాధ్యాయులపై పెట్టిన క్రిమినల్ కేసులను తక్షణమే ఎత్తివేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నేతలు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ డాక్టర్ బి.అశోక్‌ను రామయ్యపుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. విప్‌ను కలిసిన వారిలో ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

ఇచ్ఛాపురం బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం బార్‌అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ప్రక్రియ శుక్రవారం జరిగింది. ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికల్లో అధ్యక్షులుగా ఎం.సోమశేఖర్‌రెడ్డి, కార్యదర్శిగా జీరు కామేష్, కోశాధికారిగా ఆర్.దేవరాజు ఎన్నికయ్యారు.

ప్రజలకు చేసింది శూన్యం

- వైఎస్సార్‌సీపీ నాయకులు


కోటబొమ్మాళిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

టెక్కలి: మోసపూరితమైన హామీలతో అధికారం దక్కించుకున్న కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెపు రామారావు, కోటబొమ్మాళి మండల అధ్యక్షుడు సంపతిరావు హేమసుందర్‌రాజు, నాయకుడు రోణంకి ఉమా మల్లేశ్వరరావు మండిపడ్డారు. తొమ్మిది నెలల కూటమి పాలనలో కేవలం కక్ష సాధింపులు తప్పా, ప్రజలకు ఏం మేలు చేశారని ప్రశ్నించారు. కోటబొమ్మాళిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సూపర్‌సిక్స్ పథకాల పేరుతో అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం, వాటిని అమలుచేయక పోగా పాలనపై ప్రశ్నించే వారిపై కక్షసాధింపు చర్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. టెక్కలి నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడు తన అధికారంతో వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులతో ఎటువంటి అభివృద్ధి పనులు చేయకుండా అడ్డుపడుతున్నారన్నారు. ముఖ్యంగా ఒక సామాజికవర్గంపై కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు. మంత్రులు, అధికార పార్టీ నాయకులు ఎన్ని కక్షసాధింపు చర్యలు చేపట్టినా ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే ఉన్నారనే విషయం తాజాగా జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలో ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయని దౌర్భాగ్య పరిస్థితి నెలకుందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకట్రావు, సర్పంచ్ కె.సంజీవరావు, నాయకులు దుక్క రామకృష్ణారెడ్డి, పేడాడ వెంకట్రావు, బగాది దివాకర్, మెండ జగన్నాథం, శివారెడ్డి ఉన్నారు.

సత్ఫలితాలు సాధించాలి


డ్యాన్స్‌తో అలరిస్తున్న విద్యార్థులు

టెక్కలి: విద్యార్థులు సత్ఫలితాలు సాధించాలని వక్తలు అన్నారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శుక్రవారం ఉత్సాహంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, అధ్యాపకులు వాసుబాబు, కోటేశ్వరరావు, ఆచార్యులు, లీలాపద్మజ, సుగుణాధనరావు, రాంబాబు, త్రినాథరావు, జగన్నాథ్ బిసోయ్ పాల్గొన్నారు.

కృష్ణమూర్తి మృతి తీరనిలోటు


మాట్లాడుతున్న మాజీమంత్రి అప్పలరాజు

పలాస: టెక్కలిపట్నం పంచాయతీకి మూడుసార్లు సర్పంచ్‌గా పని చేయడంతోపాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించిన కోరాడ కృష్ణమూర్తి మరణం పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. టెక్కలిపట్నంలో శుక్రవారం నిర్వహించిన సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. ముందుగా కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు ఉంగ సాయిక్రిష్ణ, మందస ఎంపీపీ డొక్కర దానయ్య, పలాస మండల కమిటీ అధ్యక్షుడు దువ్వాడ రవి, కొర్ల సంతోష్, మధుకేశవరావు పాల్గొన్నారు.

కాలువలపై కవర్‌శ్లాబ్‌లు ఏర్పాటు


కాలువపై కవర్ శ్లాబ్‌లను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి 23వ వార్డు బెల్లుపడ కాలనీలో ఇటీవల కాలువలను ఏర్పాటు చేశారు. అయితే కాంట్రాక్టర్ కాలువపై కవర్ శ్లాబ్‌లు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు, ప్రజలు రకాపోకలకు తీవ్ర ఇబ్బందిపడేవారు. సమస్యను గమనించిన స్థానిక కౌన్సిలర్ జి.ప్రదీప్, స్థానిక యువత సంయుక్తంగా సుమారు రూ. 40 వేల సొంత నిధులతో కవర్ శ్లాబ్‌లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు.

రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి


డిపోను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి

పలాస: రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరని పలాస తహసీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి అన్నారు. 'తప్పని నిరీక్షణ'శీర్షికతో సాక్షిలో ఇటీవల వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని పలు రేషన్ డిపోలను శుక్రవారం పరిశీలించారు. ఈకేవైసీ కేంద్రాల వద్ద ఇబ్బందులున్నాయని గ్రహించారు. నెహ్రూనగర్‌లోని వాడ శ్రీకాంత్ డిపోను పరిశీలించి మండుటెండలో లబ్ధిదారులు బారులు తీరి ఉండటాన్ని గుర్తించారు. ఎందుకు ఆలస్యమవుతుందని డీలరును ప్రశ్నించగా సర్వరు డౌను అవుతుందని అందుకే ఆలస్యమవుతుందని వివరించారు. దీంతో డిపో వద్ద నుంచే జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి వాటిని నివృత్తి చేయాలని కోరారు. అనంతరం విలేకరులతో తహసీల్దార్ మాట్లాడుతూ.. ఈ నెలాఖరులోగా ఈకేవైసీ ప్రతి ఒక్కరు చేయించుకోవాలని చెప్పారు. నెట్ స్పీడు కూడా పెంచడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పేరుకుపోయిన పాలిథిన్ కవర్లు!



పోలవరం గ్రామంలో ఇటీవల ఐదు రోజుల పాటు పాశిపోలమ్మ సిరిమానోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ యంత్రాంగం సహకారంతో గ్రామాన్ని ఎంతో పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ఉత్సవానికి ఎక్కడెక్కడ నుంచో బంధువులంతా వచ్చారు. ఇప్పుడు ఉత్సవాలు ముగిసిన తరువాత కొంత మేరకు పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. అయితే చాలాచోట్ల ఇంకా పాలిథిన్ కవర్లు పేరుకుపోయాయి. పర్యావరణానికి, గ్రామస్తుల ఆరోగ్యానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో తొలగించేలా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. – టెక్కలి

అధ్వానం



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 17వ వార్డు రోటరీనగర్ పరిసర ప్రాంతంలో రోడ్డుపై మురుగు నీరు చేరి అధ్వానంగా మారింది. ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ఎదురుగా కాలువ నుంచి వస్తున్న మురుగునీరు నేరుగా రోడ్డుపైకి రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు, నాయకులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – కాశీబుగ్గ

అంబులెన్స్ వితరణ



గ్లో స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి వెంకన్నచౌదరి పలాసలోని కిడ్నీ పరిశోధన కేంద్రానికి అంబులెన్స్‌ను వితరణ చేశారు. దీన్ని ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, బీసీ రాష్ట్ర నాయకులు లొడగల కామేశ్వరరావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. నాయకులు బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్, నరేంద్రబాబు, కోరికన శంకర్, కొండె నరసింహ, త్యాడి దడియాల నరసింహులు ఉన్నారు. – కాశీబుగ్గ

డ్రాపౌట్లను పాఠశాలల్లో చేర్పించాలి


కొత్తంపురంలో డ్రాపౌట్ విద్యార్థిని లాస్యతో మాట్లాడుతున్న అధికారులు

కంచిలి: చదువు మధ్యలో ఆపేసి డ్రాపౌట్లుగా మిగిలిపోయిన విద్యార్థులను ఒప్పించి తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి-1 ఎస్.శివరాంప్రసాద్ సూచించారు. మఠం సరియాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో చదివి మధ్యలో మానేసిన విద్యార్థులను ఎంఈవోతోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రౌళో శుక్రవారం విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కలిశారు. ఆయా విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేరడానికి ఒప్పించారు. ఇందులో భాగంగా కొత్తంపురం, మఠం సరియాపల్లి గ్రామాల్లో డ్రాపౌట్ విద్యార్థులను కలిశారు. సీఆర్ఎంటీలు ఢిల్లీరావు, కిరణ్ ఉన్నారు.

ట్రూ అప్ చార్జీల పేరుతో బాదుడు తగదు


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

టెక్కలి: విద్యుత్ వినియోగదారుల నడ్డివిరిచే విధంగా అమలు చేస్తున్న ట్రూ అప్, సర్దుబాటు చార్జీలను తక్షణమే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం టెక్కలిలోని విద్యుత్‌శాఖ ఏఈ కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులపై దారుణంగా చార్జీల మోత మోగిస్తున్నారని మండిపడ్డారు. ఒక వైపు చార్జీల బాదుడు, మరో వైపు ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలతో పాటు స్మార్ట్ మీటర్ల పేరుతో అదనంగా చార్జీలను వసూళ్లు చేస్తున్నారని దుయ్యబట్టారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్.షణ్ముఖరావు, కె.ఎల్లయ్య, బి.వాసుదేవరావు, హెచ్.ఈశ్వర్రావు, డి.ఈశ్వర్రావు, ఎస్.చంద్రమౌళి, కె.రవి, వినోద్ పాల్గొన్నారు.

మద్యం, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- ఎస్పీ మహేశ్వరరెడ్డి


కవిటి: రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కవిటి: మద్యం, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. నేరాల కట్టడి, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలనకు ఫ్రెండ్లీ పోలీసింగ్ చక్కని సాధనంగా ఉపయోగపడుతోందన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కవిటి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, ముఖ్యమైన రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు, పాత నేరస్తుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. బాలికలు, మహిళల మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నిరంతరం డ్రోన్ కెమెరాలను వినియోగించి చట్ట వ్యతిరేకమైన అసాంఘిక కార్యక్రమాలపై నిఘా ఏర్పాటు చేసి చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు, ఇచ్ఛాపురం సీఐ మీసాల చిన్నంనాయుడు, కవిటి ఎస్సై వి.రవివర్మ ఉన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో నేరాల కట్టడి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారించాలని శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సిబ్బందికి సూచించారు.. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం కాశీబుగ్గ డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించారు. సబ్ డివిజన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, నిరంతరం డ్రోన్ కెమెరాల వినియోగించి చట్ట వ్యతిరేకమైన అసాంఘిక కార్యక్రమాలపై నిఘా ఏర్పాటు చేసి చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కాశీబుగ్గ: కాశీబుగ్గలో ప్రతీ శుక్రవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సివిల్, కుటుంబ కలహాలు, ఆస్తి, కొట్లాట, మిస్సింగ్, ఇతరత్రా అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి అందజేయాలని దిగువ స్థాయి అధికారులకు సూచించారు.

పాస్టర్ మృతికి కారకులైన వారిని శిక్షించాలి


కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న దళిత, ఆదివాసీ సంఘాల నాయకులు

టెక్కలి: దళిత పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతికి కారకులైన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం టెక్కలి అంబేడ్కర్ జంక్షన్‌లో దళిత సంఘాలు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రవీణ్‌పై కక్షకట్టి హత్య చేశారని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పాస్టర్ మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవడమే కాకుండా బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వివిధ దళిత, ఆదివాసీ సంఘాల నాయకులు బోకర నారాయణరావు, చల్లా రామారావు, బెలమర ప్రభాకరరావు, ఆట్ల రాహుల్, యడ్ల గోపి, ఎస్.గోపినాథ్, పి.ఆదవకుమార్, టి.సూర్యం, కె.దమయంతి, ఎ.మాధవరావు, కె.శ్రీను, జె.బాబూరావు, ఎన్.చంద్రమౌళి, సీహెచ్ శ్రీను పాల్గొన్నారు.